

శాస్త్రీయ విధానమే మేలు

గొర్రెల పెంపకం లాభాదాయకంగా ఉండాలంటే శాస్త్రీయ విధానాలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో▸



కుళ్లిన కూరగాయలతో..

విద్యార్థులకు కుళ్లిన కూరగాయలతో భోజనం పెట్టడం ఏమిటని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మండిపడ్డారు. 8లో▸



పరిష్కారానికి కృషి..

ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాలేజీలో సంప్రదించాలని సూచించారు. టెన్త్ మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, నాలుగు పాస్ పోర్టుసైజు ఫొటోలతో రావాలని సూచించారు.

వన మహోత్సవంలో మంత్రి కొండా సురేఖ



విద్యార్థులతో మంత్రి సురేఖ

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ పరిధిలోని గుమ్మడవెల్లి ఫారెస్ట్ భూముల్లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం సీడ్ బాల్స్ విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులతో కలిసి వన మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, స్థానిక నాయకులు ఉన్నారు.

మైనార్టీ యువతకు ఉచిత కోచింగ్

కందుకూరు: మైనార్టీస్ స్టడీ సర్కిల్, కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ తరఫున చదువుకున్న మైనార్టీ (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, పార్సీ, జైన, బౌద్ధ) యువతకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.నవీన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 1,2,3,4 ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 21లోపు కలెక్టరేట్‌లోని మైనార్టీ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు



మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: పొదుపు సంఘాలకు అండగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి అన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బుధవారం మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. బ్యాంక్ లింకేజీ కింద మంజూరైన రూ.2 కోట్ల రుణాలను అందజేశారు. అనంతరం గాంధీనగర్ చౌరస్తాలో మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ కృపాకర్, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, టీపీఓ కిరణ్, డీఈఈ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్లాట్లు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎనికేపల్లి రైతులు

మొయినాబాద్: అర్హులైన రైతులందరికీ ప్లాట్లు కేటాయించాలని ఎనికేపల్లి గోశాల భూ బాధితులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎనికేపల్లి సర్వేనంబర్ 180లో గోశాలకు కేటాయించిన 99.14 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు పరిహారంగా ఒక్కొక్కరికి 300 గజాల స్థలం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సమగ్ర విచారణ జరిపించి, అర్హులైనవారందరికీ ప్లాట్లు ఇవ్వాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, రైతులు మహిపాల్, రాము, శ్రీనివాస్, సికిందర్ తదితరులు ఉన్నారు.

గూడు కట్టని నిర్లక్ష్యం

అద్దె భవనాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- జిల్లాలోని 22 ఎస్ఆర్ఓలలో రెండింటికే సొంత ఆఫీసులు
- గాలి, వెలుతురు లేని ఇరుకైన భవనాల్లోనే రిజిస్ట్రేషన్లు
- అధికారుల క్యాబిన్ల నిండా గుట్టలుగా పేరుకుపోయిన దస్త్రాలు
- రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నా కనీస సదుపాయాలు కరువే



బాలానగర్‌లోని జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేరుకుపోయిన ఫైళ్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ప్రతినెలా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. సరూర్‌నగర్, కొడంగల్ మినహా మిగిలిన ఎస్ఆర్ఓ ఆఫీసులన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం ముందే స్లాట్ బుక్ చేసుకుని ఆఫీసుకు చేరుకున్న విక్రయ, కొనుగోలుదారులతో పాటు సాక్షులుగా వచ్చిన వారికి కనీస సదుపాయాలు కల్పించలేని దుస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలతో పాటు కంప్యూటర్లు తరచూ మొరాయిస్తుండటంతో ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం 20 నిమిషాల సమయం పడుతోంది. ఇంతసేపు కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా లేవు. గాలి, వెలుతురు లేని గదుల్లో కనీసం తాగునీరు సైతం లేకపోవడంతో సమీపంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంతో మహిళలు, యువతులు అవస్థలు పడుతున్నారు. కనీస వసతులు లేని ఇరుకైన భవనాలకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.10 లక్షల వరకు అద్దె చెల్లిస్తుండటం గమనార్హం. ఇరుకైన జిల్లా భవనానికి ప్రతి నెలా రూ.1.30 లక్షల చొప్పున, ఇతర ప్రాంతాల్లోని ఒక్కో భవనానికి నెలకు రూ.25 వేల నుంచి రూ.50 వేల చొప్పున అద్దె సమర్పించుకుంటున్నారు. నిజానికి జిల్లాలో ప్రభుత్వ భూములు పెద్ద మొత్తంలోనే ఉన్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద నిధులకూ కొరత లేదు. కానీ అధికారులు, పాలకుల కారణంగా వీటికి సొంత భవనాల కల నెరవేరడం లేదు.

నిత్యం వందలాది రిజిస్ట్రేషన్లు

జిల్లాలో మొత్తం 22 సబ్ రిజిస్ట్రార్ కేంద్రాలున్నాయి. వీటిలో నిత్యం వాణిజ్య, గృహ, వ్యవసాయేతర ఖాళీ భూముల, మ్యారేజీ, సొసైటీలు, చిట్ ఫండ్స్ రిజిస్ట్రేషన్లు, జీపీఏ, రెక్టిఫికేషన్, లీజుకు సంబంధించి వందలాది అగ్రిమెంట్లు చేస్తారు. ఒక్కో ఎస్ఆర్ఓలో రోజుకు సగటున 50 నుంచి 60 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ రూపంలో ప్రభుత్వానికి ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.వేలల్లో సమకూరుతోంది.

ఆంతర్యం ఏమిటో..?

జిల్లాల పునర్విభజనలో భాగంగా గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలుగా విభజించింది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ తర్వాత జిల్లాల వారీగా సమీకృత కలెక్టరేట్ భవనాలను నిర్మించింది. రెవెన్యూ సహా ఇతర శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చింది. కానీ కీలకమైన రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఇప్పటికీ మేడ్చల్ జిల్లా(బాలానగర్) పరిధిలోనే కొనసాగిస్తుండటం వెనక ఆంతర్యం ఏమిటో అంతుచిక్కడం లేదు. చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం ప్రజలు నగరంలోని ట్రాఫిక్ వలయాన్ని దాటుకుని ఇక్కడికి చేరేందుకు అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

ఎక్కడ చూసినా ఫైళ్ల గుట్టలు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎటూ చూసినా దుమ్ముధూళి పేరుకుపోయిన ఫైళ్ల గుట్టలే కనిపిస్తున్నాయి. ఉద్యోగులు కూర్చునే క్యాబిన్లతో పాటు కారిడార్లలోనూ రికార్డుల మూటలే దర్శనమిస్తున్నాయి. ఎవరైనా బాధితులు సంబంధిత అధికారి టేబుల్ వద్దకు చేరుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చిన వ్యక్తి కనీసం నిలబడేందుకు కూడా ఆయా క్యాబిన్లలో చోటు లేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఏదైనా ఇతర కారణాలతో అగ్గి రాజుకుంటే.. దస్త్రాల్లోని ప్రజల ఆస్తులన్నీ బుగ్గిపాలు కావాల్సిందే.



ఆఫీస్ కారిడార్‌లో దస్త్రాల మూటలు

సొంత భవనాలు నిర్మించాలి



ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న సబ్ రిజిస్టర్ ఆఫీసులకు సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటు. వివిధ ప్రాంతాల నుంచి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌ల కోసం ఆఫీసుకు వస్తున్న వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణం. ప్రభుత్వం వెంటనే ఆయా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలి.

– చంద్రశేఖర్

ప్రతిపాదనలు పంపాం



పక్కా భవనాలు లేకపోవడం నిజమే. 20 ఎస్ఆర్ఓలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఉద్యోగుల నిష్పత్తి మేరకు గదులు లేకపోవడంతో కొద్దిపాటి స్థలంలోనే చిన్న క్యాబిన్లు ఏర్పాటు చేశాం. సంస్థాగతంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పక్కా భవనాలు నిర్మిస్తుందని ఆశిస్తున్నాం.

– సంతోష్, జిల్లా రిజిస్ట్రార్



రూ.40 లక్షలతో సీసీగా మారనున్న యాచారంలోని ఓ కాలనీ రోడ్డు

ఫ్యూచర్ జీపీల్లో.. అభివృద్ధి మంత్రం!

- యాచారం మండలంలోని అన్ని గ్రామాలపైనా టీజీఐఐసీ నజర్
- రూ.30 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం
- అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపాలని సూచన
- వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ
- ప్రపోజల్స్ రూపకల్పనలో అధికారులు బిజీ

యాచారం: మండలానికి టీజీఐఐసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. గతంలో ఫార్మాసిటీ కోసం అత్యధికంగా భూములిచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను రూ.19 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. దీంతో పాటు మండలంలోని మిగిలిన 20 గ్రామాల్లోనూ అవసరమైన అభివృద్ధి పనులకు ఫండ్స్ ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పైన పేర్కొన్న నాలుగు గ్రామాల్లోని తొమ్మిది వేల ఎకరాల అసైన్డ్, పట్టా భూములను ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తూ దీని స్థానంలో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని వెల్లడించిన విషయం తెలిసిందే. ఇది నమ్మని స్థానిక రైతులు పట్టా భూములను ఇచ్చేది లేదని ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జనంలో విశ్వాసం కలిగేలా గ్రామాల్లో అభివృద్ధి పనులకు టీజీఐఐసీ సిద్ధమైంది.

ప్రతిపాదనల తయారీ

యాచారం మండలంలోని 20 గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను టీజీఐఐసీ నుంచి మంజూరు చేయించే విషయంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించారు. ఆయా జీపీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, పంచాయతీ, కమ్యూనిటీ భవనాలు, అసంపూర్తిగా అంగన్‌వాడీ, పాఠశాల, మండల, జిల్లా పరిషత్, ఆస్పత్రి తదితర భవనాలను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందుకోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఏ పనులు పెండింగ్ ఉన్నాయో చెప్పాలంటూ ఆ శాఖ అధికారులు నాయకులకు ఫోన్లు చేస్తున్నారు.

నమ్మకం కలిగేలా..

ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 19,333 ఎకరాలు కావాలని భావించిన గత ప్రభుత్వం తొమ్మిది వేల ఎకరాలకు పైగా సేకరించింది. ఇందులో యాచారం మండలంలోని నాలుగు గ్రామాల నుంచే ఎక్కువ భూమిని తీసుకున్నారు. నష్టపోయింది కూడా ఇక్కడి రైతులే. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని సింహభాగం ఆ నాలుగు గ్రామాల్లోనే నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేస్తే బాగుంటుందని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఇదిలా ఉండగా కొద్ది నెలల క్రితం మొండిగౌరెల్లిలోని 820 ఎకరాల అసైన్డ్, పట్టా భూమి సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. బాధిత రైతులకు న్యాయబద్ధమైన పరిహారం అందించడంతో పాటు అభివృద్ధి కనిపించేలా చేస్తే వ్యతిరేకత ఉండదనేది టీజీఐఐసీ యోచనగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మేజర్ గ్రామాలైన యాచారం, చింతపట్ల, గునుగల్, మాల్, నందివనపర్తి, చింతుల్ల, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి తదితర జీపీల్లోనూ పలు అభివృద్ధి పనులకు బీజం పడనుంది.

ఫోన్లు చేసి అడుగుతున్నాం



యాచారం మండలంలోని 20 గ్రామాల్లో ఏయే అభివృద్ధి పనులు కావాలో గుర్తించి వివరాలు పంపాలని మాజీ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలకు సూచిస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, భవనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నాలుగు రోజులుగా ఇదే పనిలో బిజీగా ఉన్నాం.

– శ్రీనివాస్, పీఆర్ డీఈఈ

రూ.30 కోట్లకు పైగా నిధులు



మండలంలోని 20 గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులకు రూ. 30 కోట్లకు పైగా టీజీఐఐసీ నిధులు ఖర్చు చేయనున్నాం. ప్రపోజల్స్ పంపిన వెంటనే ఫండ్స్ రిలీజ్ చేస్తామని టీజీఐఐసీ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. యాచారంతో పాటు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సన్నాహాల దారిలో..

త్వరలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు

- రెండు దశల్లో నిర్మించనున్న హెచ్ఎండీఏ
- మొదటి దశలో రావిర్యాల– మీర్‌ఖాన్‌పేట్
- రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్– ఆమన్‌గల్ వరకు
- మహా నగరాభివృద్ధిలో ఎంతో కీలకం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఫ్యూచర్‌సిటీ మీదుగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సన్నాహాలు చేపట్టింది. రెండు దశల్లో పూర్తిచేయనున్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్అండ్‌టీ సంస్థ టెండర్లను దక్కించుకున్న సంగతి తెలిసిందే. మొదటి దశలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రూ.1665 కోట్లతో చేపట్టనున్న 19.20 కి.మీ. రోడ్డును రిత్విక్ సంస్థకు అప్పగించారు. మొదటి దశలో రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణకు ప్రభుత్వం రూ.246 కోట్లు కేటాయించింది. రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్ వరకు 22.3 కి.మీ మేర నిర్మించనున్నారు. రూ.2,365 కోట్లతో చేపట్టనున్న రెండో దశ పనులను ఎల్అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. రెండో దశ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.345 కోట్లు కేటాయించింది. మొత్తం రూ.4030 కోట్లతో 41 కిలోమీటర్లకు పైగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం హెచ్ఎండీఏ రూ.591 కోట్లతో మొత్తం 1003.61 ఎకరాల భూములను సేకరించనుంది. ఇందులో సుమారు 202 ఎకరాలు టీజీఐఐసీకి చెందినవి కాగా, మరో 231.72 ఎకరాల అటవీ భూములు కూడా ఉన్నాయి. భూముల సేకరణ కోసం ప్రభుత్వం పరిపాలన అనుమతులను గతంలోనే ఇచ్చింది.

హైదరాబాద్ 'ఫ్యూచర్'కు మణిహారం..

హైదరాబాద్ మహా నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్‌సిటీ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుతో ఆర్థికాభివృద్ధి పరుగులు పెట్టనుందని ప్రభుత్వం భావిస్తోంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రధాన రహదారుల మధ్య నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఎంతో కీలకం కానుంది. టౌన్‌షిప్‌లు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, లాజిస్టిక్ హబ్స్ తదితర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు సీమ్‌లెస్ జర్నీ సదుపాయాన్ని అందజేయనుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు కొత్తగా నిర్మించనున్న మెట్రో రైల్ కారిడార్‌ను గ్రీన్‌ఫీల్డ్ మార్గంలోనే చేపట్టనున్నారు. ఇతర రూట్లలో ఎలివేటెడ్ కారిడార్‌లుగా నిర్మించనుండగా, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో మెట్రోరైల్ కారిడార్ భూమిపైనే నిర్మించనున్నారు. పర్యావరణహితమైన ఫ్యూచర్‌సిటీ విస్తరణకు ఈ మార్గం దోహదం చేయనుంది. టెండర్లను దక్కించుకున్న సంస్థలకు త్వరలో వర్క్ ఆర్డర్‌లు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో రోజురోజుకు బీఆర్ఎస్ బలపడుతుందని చెప్పారు. నగరంలోని సబితారెడ్డి నివాసంలో బుధవారం చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు గోనే కరుణాకర్‌రెడ్డి, యూత్ నాయకుడు వంగ శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకొచ్చేది బీఆర్ఎస్సేనని నమ్మి పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రజలు కేసీఆర్‌ని మళ్లీ సీఎంగా కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో ఊరడి రాములు, గౌడిచర్ల రమేశ్, మోహన్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీకాంత్, మహేశ్‌చారి, అంజయ్య, సతీశ్, రమేశ్, రాములు, మల్లేశ్, విఠల్, మహేందర్, జైపాల్, బద్రి, ప్రవీణ్‌గౌడ్, మహేందర్, తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి. క్రిష్టారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శశిపాల్, శేరి రాజు, షేక్ ఆరిఫ్ మియా, గోనే మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణ వితరణ లక్ష్యం చేరాలి

బ్యాంకర్ల సమీక్షలో కలెక్టర్ నారాయణరెడ్డి



బ్యాంకర్లతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రుణ పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అంకితభావంతో పని చేయాలని, తద్వారా ఆయా వర్గాల అభ్యున్నతికి దోహదపడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి బ్యాంకు నియంత్రణ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట రుణ లక్ష్యాన్ని పూర్తి చేయడం, రుణ వితరణ లక్ష్యాన్ని అధిగమించడంలో కొన్ని బ్యాంకులు లక్ష్యాలను ఎందుకు చేరుకోవడం లేదో తెలియజేయాలని కోరారు. ఆయా రంగాలలోని అనేక బ్యాంకులు లక్ష్యాల ప్రకారం రుణాలు అందిస్తున్నప్పటికీ, కొన్ని బ్యాంకులు వెనుకబడ్డాయని తెలిపారు. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి టార్గెట్ సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ఉన్నత విద్య, గృహ నిర్మాణాల కోసం అందుబాటులో ఉన్న రుణ సౌకర్యాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పలు వర్గాల ఆర్థిక పురోగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల కింద అర్హులైన వారికి లోన్లు మంజూరు చేసి మద్దతు అందించాలని తెలిపారు. వీధి వ్యాపారులకు సూక్ష్మ రుణాలు త్వరగా మంజూరు చేయాలని, తద్వారా వారు వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి ఆర్థిక సాయం అందించవచ్చని వివరించారు. ఇందిరా మహిళా శక్తి సంఘాలకు అవసరమైన రుణాలు అందించాలని, ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది వికలాంగులు ఉన్న గ్రూపులకు బ్యాంకు ఖాతాలు తెరిచి రుణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు వ్యవసాయ, పశుసంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఇతర శాఖల సమన్వయంతో స్వయం ఉపాధికి ఆర్థిక మద్దతు ఇవ్వాలన్నారు. రుణగ్రహీతలు యూనిట్లు స్థాపించారా.. లేదా..? నిశితంగా పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను పూర్తిగా పంపిణీ చేయాలని మరియు సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం తగదని సూచించారు. ఎల్‌డీఎం సుశీల్ కుమార్, ఆర్‌బీఐ రెహమాన్, నాబార్డ్ ఏజీఎం అఖిల్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యాన శాఖ అధికారి సురేశ్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి, బ్యాంకు నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.



మద్ది కరుణాకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

స్థానిక పోరులో సత్తా చాటుతాం

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయన గృహానికి చేరుకొని కేక్‌ను కట్ చేయించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలతో పాటు పలువురు నేతలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మలూరు గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, యాదగిరిగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం



ట్రాక్టర్ కింద ఆంజనేయులు మృతదేహం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరపాట ఆంజనేయులు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా బుధవారం లింగధన గ్రామం నుంచి ట్రాక్టర్‌తో జూలపల్లి వస్తుండగా గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



శివకుమార్ (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీకి చెందిన వెంకటేష్ కుమారుడు శివకుమార్(30) భార్య మాధవి ఈ నెల 7న ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి శివకుమార్ మనోవేదనతో ఉన్నాడు. ఈ నెల 29న డ్యూటీకి వెళ్లిన అతడు మధ్యాహ్నం బంధువుకు ఫోన్ చేసి 'అమ్మ, నాన్న జాగ్రత్త.. తమ్ముడికి గైడెన్స్ ఇవ్వు' అంటూ కాల్ చేసి అనంతరం ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. అతని ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వెంకటేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇతని ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ విధానమే మేలు

- గొర్రెల సంరక్షణ అవసరం
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి





షాబాద్: తిమ్మారెడ్డిగూడలో గొర్రెల మంద

షాబాద్: గొర్రెల పెంపకం లాభదాయకంగా ఉండాలంటే పిల్లలు పుట్టిన వెంటనే శాస్త్రీయ పద్ధతిలో యాజమాన్య పోషణ, ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలి. సమగ్ర విధానాలతో జీవాలను కాపాడుకోవచ్చని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గొర్రెల కాపరులకు సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ముక్కు, నోరు మీద ఉండే పొర తొలగించి పొడి గుడ్డతో తుడవాలి. బొడ్డుదానంతట అదే విడిపోకపోతే రెండు అంగుళాలు కత్తిరించి అయోడిన్‌తో శుభ్ర పరచాలి. పుట్టిన గంటసేపు ముర్రుపాలు తాగించాలి. ముర్రుపాలలో ఏ, డీ, ఈ విటమిన్‌లు వ్యాధి నిరోధక శక్తినిచ్చే యాంటీబాడీలు అధికంగా ఉంటాయి. పిల్లలను పొడిగా ఉంచి వెలుతురు, గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లో కట్టి వేయాలి. గొర్రె పిల్లలను చలి నుంచి కాపాడాలి.

పాటించాల్సిన పద్ధతి

పాలు మరిచే వరకు(దాదాపు 3 నెలలు) గొర్రె పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలను తల్లితో పాటు మందకు పంపకుండా కొట్టంలోనే ఉంచి పెంచాలి. తల్లితోపాటు పంపితే శక్తి వృథా అయి పెరుగుదల తగ్గుతుంది. ఇంటి దగ్గర పెట్టిన పిల్లలను గాలి, వెలుతురు బాగా ఉండే కొట్టంలో తడకలు కట్టి అందులో వదలాలి. వరిగడ్డి పక్కలో వేసితే వెచ్చగా ఉండి పిల్లలు మట్టి తినకుండా చూడవచ్చు.

గొర్రె పిల్లల పోషణ

గొర్రె పిల్లల్లో పెరుగుదల మొదటి మూడు నెలల్లో ఎక్కువ ఉంటుంది. ఇలా అధిక పెరుగుదలున్నా గొర్రె పిల్లలే ముందు ఆరోగ్యంగా ఉండి ఎక్కువ బరువు తూగి లాభాలు చేకూర్చుతాయి. పాలు మరిచే వయసు వరకు తల్లిపాలకు అదనంగా పోషనివ్వాలి. చిన్న గొర్రెలను నిదానంగా ఆకు తింటూ అవి జీర్ణించుకోవడానికి అలవాటు పడతాయి.

ఆరోగ్య పరిరక్షణ

తల్లి గొర్రెలను మేతకు పంపిన తర్వాత వేపాకు లేదా దాణా వేసి అన్ని పిల్లల ఆరోగ్యంగా ఉన్నదీ లేనిది చూడాలి. మూడు నెలల వయసు దాటిన తర్వాత మొదటిసారి నట్టల నివారణ మందు తాపాలి. ఇది ఊపిరితిత్తుల్లోకి పోకుండా జాగ్రత్తగా తాపాలి. దీని తర్వాత 10–15 రోజుల వ్యవధిలో చిటుకువ్యాధి టీకా మందు ఇవ్వాలి. మరో 15 రోజులకు రెండో డోసు టీకా ఇవ్వాల్సి ఉంటుంది.

సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు అన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకొని రావాలని, జీవో 317లో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏల పెంపు, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు పే స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు జంగయ్య, శ్రీను, బస్వరాజ్, శ్రీనివాస్, జంగయ్య పాల్గొన్నారు.

13 ఏళ్ల బాలికకు వివాహం

- నలుగురిపై కేసు నమోదు
- చిన్నారిని సఖి సెంటర్‌కు తరలింపు

నందిగామ: అభం శుభం తెలియని 13 ఏళ్ల బాలికకు వివాహం చేసిన ఘటనలో పెళ్లి కొడుకు, బాలిక తల్లితో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. నందిగామకు చెందిన 13 ఏళ్ల బాలిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమెకు చేవెళ్ల మండలం కందవాడకు చెందిన శ్రీనివాస్‌గౌడ్(40)తో గత మే నెల 28న నందిగామ శివారులోని ఓ ఆలయంలో పెళ్లి చేశారు. అప్పటి నుంచి బాలిక నందిగామలో తల్లి వద్దే ఉంటోంది. పెళ్లి చేసుకోవడం ఏమాత్రం ఇష్టం లేని బాలిక ఇటీవల పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపింది. దీనిపై స్పందించిన హెచ్‌ఎం సుధాకర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన తహసీల్దార్ రాజేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ బాలిక కుటుంబ సభ్యులను పీఎస్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికకు పెళ్లి చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. పెళ్లి కొడుకు శ్రీనివాస్‌గౌడ్, బాలిక తల్లి స్రవంతి, మధ్యవర్తి పెంటయ్య, పురోహితుడు ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ అధికారుల సహకారంతో బాలికను సఖి కేంద్రానికి తరలించినట్లు పోలీసులు వివరించారు.

మాకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పొన్నగుట్టతండావాసులు

శంకర్‌పల్లి: ప్రభుత్వం తమకి వ్యవసాయం చేసుకోడానికి ఇచ్చిన భూమిని ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నారని బాధితులు బుధవారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నగుట్టతండాలో సర్వే నంబరు 96/130లో 4ఎకరాల భూమిని వ్యవసాయం చేసుకునేందుకు గాను అప్పటి ప్రభుత్వం 1967లో వాల్య అనే వ్యక్తికి ఇచ్చింది. అప్పటి నుంచి ఆయన వ్యవసాయం చేసుకుంటూ ఉండగా, కొన్నేళ్ల క్రితం వాల్య మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన నలుగురు కుమారులు కిషన్, శంకర్, రాంసింగ్, అమ్రియాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొన్ని నెలల క్రితం మోకిల తండాకు చెందిన ఓ వ్యక్తి వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ భూమిని ఆక్రమించాడు. దీంతో అప్పటి నుంచి బాధితులు న్యాయం చేయాలంటూ తహసీల్దార్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. సమస్యపై తహసీల్దార్ సురేందర్ వివరణ కోరగా.. సంబంధిత అధికారులను వెళ్లి పరిశీలించాలని సూచించినట్లు స్పష్టం చేశారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన దంపతులు

కొత్తూరు: బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్తూ ఓ దంపతులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన కొత్తూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి, తన భార్య పద్మతో కలిసి బైక్‌పై కాటేదాన్‌లో తమ బంధువుల అంత్యక్రియలకు ఉదయం బయలుదేరారు. కాగా పెంజర్ల కూడలిలో రోడ్డును దాటే క్రమంలో ప్యాసింజర్ జీపు ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

జిల్లా మహాసభలకు తరలిరండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శంకర్‌పల్లి: మొయినాబాద్‌లో ఆగస్టు 2న నిర్వహించే సీపీఐ 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం శంకర్‌పల్లిలో సీపీఐ మండలాధ్యక్షుడు సుధీర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రామస్వామి మాట్లాడుతూ.. 17వ జిల్లా మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు అవుతున్నారని, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అదే విధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం కావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అహ్మద్, రవీందర్, మల్లయ్య, సువర్ణ, యాదయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఠాణా నిర్మాణ పనుల పరిశీలన

దుద్యాల్: దుద్యాల్ గేట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ పనులను పరిగి డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. పనులు వేగంగా సాగించాలని, త్వరగా పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్కడి నుంచి నేరుగా దుద్యాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల పని తీరును పరిశీలించారు. కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తుండాలని ఎస్ఐ యాదగిరికి సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ



బదిలీపై వెళ్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన రాఘవేందర్‌రెడ్డి బదిలీపై పహాడీషరీఫ్ ఠాణాకు వెళ్లారు. సీఐగా రవికుమార్‌కు రాఘవేందర్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. అనంతరం సీఐ రాఘవేందర్‌రెడ్డికి ఆదిబట్ల పోలీసులు గజమాలతో సత్కరించారు. నూతనంగా విచ్చేసిన సీఐ రవికుమార్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ తోడ్పాటు నందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, సైదులు, నోయల్‌రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి



యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పీఎస్ సీఐగా సత్యనారాయణ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పీఎస్ పరిధిలో శాంతి భద్రతల కోసం కృషి చేస్తానని, ప్రజలు కూడా సహకరించాలని నూతనంగా బాధ్యతల చేపట్టిన సీఐ అన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



చిత్తాపూర్‌లో ధ్వంసం చేసిన కడీలను చూపిస్తున్న రైతులు

మంచాల: తమ భూమిలోకి అక్రమంగా చొరబడి కడీలు విరగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని తాళ్లపల్లిగూడ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోలమోని ఆశయ్య, పోలమోని భిక్షపతి, పోలమోని ప్రభు, కోయిగూర సుధాకర్, కోయిగూర భాస్కర్, కోయిగూర కరుణాకర్‌లకు సంబంధించి సర్వే నంబర్ 79లో 0–25 గుంటల భూమి ఉంది. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని చిత్తాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని సదరు రైతులు ఆరోపించారు. మంగళవారం రాత్రి పొలంలో నాటిన కడీలను విరగొట్టారని, అక్కడే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై సీఐ మధును వివరణ కోరగా.. పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కటకటాలకు పాత నేరస్తుడు

మూడు నెలల క్రితం చోరీకి పాల్పడిన దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడు మురళి


మొయినాబాద్: పలు ప్రాంతాల్లో వరుసగా చోరీలు చేస్తూ మూడు నెలల క్రితం మండలంలోని పెద్దమంగళారంలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను మొయినాబాద్ పోలీసులు పట్టుకున్నారు. దోచుకున్న సొత్తును స్వాధీనం చేసుకుని కటకటాల్లోకి పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన తిమ్మగళ్ల మురళి అలియాస్ ముత్యాలు అత్తాపూర్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మే నెల 5న రాత్రి 10 గంటల సమయంలో బస్సులో మొయినాబాద్‌కు వచ్చాడు. క్వాటర్ బాటిల్ మద్యం కొనుక్కుని ఒక్కడే కూర్చొని తాగాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో పెద్దమంగళారం గ్రామానికి వెళ్లి తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేశాడు. తనతో తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. బీరువాలోని 26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు దోచుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు సుమారు మూడు నెలలకు బుధవారం దొంగను పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా గత మార్చి నుంచి మైలార్‌దేవ్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మరో ఆరు దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన సొత్తును అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

27 దొంగతనం కేసులు

పెద్దమంగళారంలో దొంగతనం చేసి పట్టుపడిన మురళి పాత నేరస్తుడు. అతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 27 దొంగతనం కేసులున్నాయి. మురళి ఖర్చుల కోసం దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. దొంగతనానికి వెళ్లే ముందు ఒక్కడే మద్యం తాగి వెళ్తాడు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని తన వెంట తెచ్చుకునే ఇనుపరాడ్డుతో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతాడు. దొంగిలించిన ఆభరణాలను విక్రయించి డబ్బులను ఖర్చులకు వాడుకుంటాడు. ఇలా సైబరాబాద్, వరంగల్, సంగారెడ్డి, కడప, కర్నూలు జిల్లాల్లో దొంగతనాలు చేసి చాలాసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.

కుళ్లిన కూరగాయలతో భోజనమా?

- పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య ఆగ్రహం
- మున్సిపాలిటీలో సిబ్బందికి దుస్తుల పంపిణీ



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మున్సిపల్ కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కుళ్లిన కూరగాయలతో వంట చేసి, భోజనం పెట్టడం ఏంటని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శంకర్‌పల్లి కేజీబీవీ పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. బుధవారం శంకర్‌పల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే మొదట మున్సిపాలిటీలో కొత్త ట్రాక్టర్, పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోర్టులు, గ్లౌజ్‌ల పంపిణీ చేశారు. పట్టణ శివారులో నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లోపలికి వెళ్లి వంట గదిని ఆయన పరిశీలించారు. అక్కడ కూరగాయలు పాడైపోవడం, సాంబారులో పప్పు లేకపోవడం, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యంతో ఆ ఫలాలు విద్యార్థులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించారు. ప్రిన్సిపాల్, మరో ఉపాధ్యాయుడు ఎందుకు రాలేదని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలో ఖాళీ స్థలం ఎందుకు వదిలేశారంటూ, ఆ ఖాళీ స్థలాన్ని ఆయన పూరించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, నాయకులు ప్రవీణ్, వెంకట్‌రాంరెడ్డి, ప్రకాశ్ గుప్తా, పాండు రంగారెడ్డి, చంద్రమౌళి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 నిమిషాలు గేటు బయటే..

కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే రోజూ మాదిరి సిబ్బంది గేటుకు తాళం వేసుకొని లోపల ఉన్నారు. ఎమ్మెల్యే వచ్చినట్లు సమాచారం ఇచ్చినప్పటికీ దాదాపు 10నిమిషాల వరకు వారు గేటు తాళం తీయకపోవడం గమనార్హం. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్, నాయకులు గేటు బయటే వేచి ఉన్నారు.